రెచ్చిపోతున్న రౌడీ మూకలు

- వేంపల్లెలో శాంతి భద్రతలు కరువు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న పోలీసులు

వేంపల్లె : వేంపల్లెలో సినిమా ఫక్కీలో గ్రూపుల ఆధిపత్యం ఎక్కువైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వేంపల్లెలో శాంతి భద్రతలు కరువయ్యాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యువత గ్రూపులుగా ఏర్పడి మద్యం తాగి రౌడీయిజం చెలాయిస్తున్నారు. మారణాయుధాలు, పిడి బాకులు, నాటు కట్టెలతో ఒక గ్రూపు, మరో గ్రూపుపై దాడులకు పాల్పడుతున్నారు. పట్టణంలో వరుస ఘటనల నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

రౌడీలకు అడ్డా సంత మార్కెట్, నాలుగు రోడ్ల కూడలి

పట్టణంలోని సంత మార్కెట్ వీధి, నాలుగు రోడ్ల కూడలి ప్రాంతాలు రౌడీలకు అడ్డాగా మారాయి. ఇక్కడ ఆధిపత్య పోరులో రెండు వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన యువత రెండు గ్రూపులుగా ఏర్పడి రౌడీ మామూళ్లకు శ్రీకారం చుట్టారు. ఏదో ఒకచోట ఈ రెండు గ్రూపులు తలపడుతుండటంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది.

రౌడీ గ్రూపులకు నాయకుల అండ

అధికార పార్టీ నాయకులు ఈ రెండు గ్రూపులను తమ అక్రమ దందాకు పావులుగా వాడుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మొన్న మండలంలోని తువ్వపల్లె గ్రామానికి చెందిన వేంపల్లె అజయ్ కుమార్ రెడ్డిపై, నిన్న వేంపల్లెకు చెందిన శ్రీకాంత్ రెడ్డిపై, నేడు వేంపల్లెకు చెందిన కొత్తూరు లోకేష్‌పై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమని పలువురు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇసుక, గ్రావెల్ మట్టి, అక్రమ రవాణా, ప్లాట్లు, స్థల సెటిల్మెంట్లు, ఇతరత్రా దందాల్లో ఈ రౌడీ మూకలతో బెదిరింపులకు పాల్పడుతూ నాయకులు యథేచ్ఛగా తమ అక్రమ దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పోలీసులు వైఫల్యం

రౌడీ మూకల చర్యలను అరికట్టాల్సిన పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారన్న విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఈ గ్రూపుల రౌడీ దందాను అరికట్టడంలో పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారని తెలుస్తోంది. దీనికితోడు రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చే పోలీసులే కరువయ్యారు. దీంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అయింది. ఇప్పటికైనా పోలీసులు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు ఇలా..

- గత ఏడాది జూలై 5న పులివెందుల రోడ్డులోని రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో వేంపల్లె మండలం తువ్వపల్లె గ్రామానికి చెందిన వేంపల్లె అజయ్ కుమార్ రెడ్డిపై కొందరు రౌడీ మూకలు నాటు కట్టెలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు.
- గత ఏడాది సెప్టెంబర్ 16వ తేదీన కడప రోడ్డులో ఓ యువకుడిని పిడి బాకులతో బెదిరించి దాడికి పాల్పడడంతో అప్రమత్తమై యువకుడు పరారయ్యాడు.
- గత ఏడాది నవంబర్ 11న కడప రోడ్డులో ఉన్న బ్యాంకు సర్కిల్ వద్ద ఒక గ్రూపునకు చెందిన రౌడీ మూకలు వేంపల్లెకు చెందిన శ్రీకాంత్ రెడ్డిపై కొందరు మారణాయుధాలు, నాటు కట్టెలతో దాడికి పాల్పడ్డారు.
- 2025 జనవరి 5వ తేదీన పులివెందుల రోడ్డులో టైల్స్ మాలా షాపు వద్ద వేంపల్లెకు చెందిన కొత్తూరు లోకేష్‌పై కొందరు భౌతిక దాడికి పాల్పడి పరారయ్యారు.
- 2025 జనవరి 6న పాములూరు రోడ్డులో గ్రావెల్ మట్టి అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న రాయల్టీ సిబ్బందిని రౌడీ మూకలు బెదిరించి భౌతిక దాడులకు పాల్పడ్డారు.


బ్యాంకు సర్కిల్ వద్ద గొడవ పడుతున్న రౌడీ మూకలు (ఫైల్‌ఫొటో)


వేంపల్లెలోని టైల్స్ షాపు వద్ద గొడవ పడుతున్న రౌడీ మూకలు (ఫైల్‌ఫొటో)

గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదు



వేంపల్లెలో గత 35 ఏళ్లుగా ఇలాంటి ఘటనలు ఎప్పుడు జరగలేదు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పులివెందుల తర్వాత వేంపల్లెను అభివృద్ధి చేసేందుకు ముందుకు వెళ్లేవారు. ఆర్థికంగా, వాణిజ్యపరంగా వేంపల్లె చాలా అభివృద్ధి చెందింది. అలాంటి తరుణంలో కొందరు అల్లరి మూకలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అధికారులు, అధికార పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించి వేంపల్లెను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని కోరుతున్నాం. - షేక్ మునీర్ బాషా(స్థానికుడు), వేంపల్లె

అధికారులు చర్యలు చేపట్టాలి



అధికారులు, అధికార పార్టీ నాయకులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. అధికార పార్టీ నాయకుల అండ దండలతోనే ఇలాంటి ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పోలీసులు అల్లరి మూకల పని పట్టి కౌన్సెలింగ్ ఇవ్వాలి. అభివృద్ధిపైన దృష్టి పెట్టాల్సిందిపోయి వేంపల్లెను ఫ్యాక్షన్ గ్రామంగా తయారు చేస్తున్నారు. - రాచినేని వేణుగోపాల్(స్థానికుడు), వేంపల్లె

దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేశాం



వేంపల్లెలో శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పని చేస్తున్నాం. రౌడీ మూకల గురించి సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి నిందితులను స్టేషన్‌కు తరలిస్తున్నాం. కేసులు మోదు చేసి విచారణ చేస్తున్నాం. ప్రజా శాంతికి విఘాతం కలిగించే రౌడీ షీటర్ల బహిష్కరణకు చర్యలు చేపట్టేందుకు వెనుకాడం. - సురేష్ రెడ్డి(సీఐ) వేంపల్లె

క్లుప్తంగా

పిచ్చికుక్క దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారెడ్డి

గోపవరం : మండలంలోని రాచాయపేట పంచాయతీ బెడుసుపల్లె గ్రామానికి చెందిన పల్లెం సుబ్బారెడ్డిపై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గాయపడిన సుబ్బారెడ్డిని బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా రాచాయపేట పంచాయతీ పరిధిలోని రాచాయపేట, బెడుసుపల్లె గ్రామాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.

బ్రహ్మంసాగర్‌లో పడి వృద్ధుడి మృతి


బ్రహ్మంసాగర్‌లో పడి మృతి చెందిన రామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం సమీపంలోని బ్రహ్మంసాగర్‌లో గురువారం వీరపునాయునిపల్లె మండలం వెల్లుర్తి గ్రామానికి చెందిన రామిరెడ్డి(78)అనే వృద్ధుడు మృతి చెందాడు. బ్రహ్మంసాగర్‌లో వృద్ధుడి మృత దేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ గుర్రప్ప సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వృద్ధుడి భార్య చనిపోవడంతో మనశ్శాంతి కోసం గండి, ఓబుళం, బ్రహ్మంగారి మఠం ప్రాంతాల్లో తిరిగేవాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం బ్రహ్మంగారిమఠం వచ్చి బ్రహ్మంసాగర్‌లో పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ సమీపంలో బ్రిడ్జి వద్ద ఉన్న విద్యుత్ తీగలు తగిలి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. కడప తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సంజీవకుమార్ (23) కడపలో గత రెండేళ్ల నుంచి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ట్రాన్స్‌పోర్టు వెనుక భాగంలో పనిచేస్తున్న సమయంలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. మృతుని బంధువులకు సమాచారం ఇచ్చామని వారు వచ్చిన తరువాత ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఐదుగురికి యావజ్జీవ కారాగార శిక్ష


పోలీసుల అదుపులో ముద్దాయిలు

మైలవరం : మైలవరం మండల పరిధిలోని తొర్రివేముల గ్రామం వద్ద ఐదేళ్ల క్రితం జరిగిన హత్య కేసులో ఐదుగురికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 2 లక్షల జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టు తీర్పు ఇచ్చింది. మైలవరం ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుమ్మరి గురుప్రసాద్ భార్య ప్రమీలకు తీట్ల సురేష్ (ఆటో సూరి)తో వివాహేతర సంబంధం ఉండేది. దీంతో భర్త గురు ప్రసాద్ భార్య ప్రమీలను మందలించాడు. తమ వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతున్నాడనే ఉద్దేశంతో 2019 సంవత్సరం జనవరి 24వ తేదీన గురుప్రసాద్‌ను తొర్రివేముల గ్రామ పరిధిలోని బాబాసాబ్ బావి వద్ద కాపు కాసి రాడ్లతో కొట్టి హత్య చేశారు. దీనిపై మైలవరం పోలీసులు తీట్ల సురేష్ (ఆటో సూరి), కొమ్ము పెద్దిరాజు, చాకలి గురుస్వామి, ఉప్పలపాడు ఓబుల్ ప్రతాప్, కుమ్మరి విజయ ప్రమీలపై కేసు నమోదు చేశారు. ఐదేళ్ల తర్వాత నేరం నిరూపితం కావడంతో ముద్దాయిలకు గురువారం ప్రొద్దుటూరు ఏడీజే కోర్టు జీవిత ఖైదు, రూ.2 లక్షల రూపాయల జరిమానా విధించింది.

అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన అధ్యాపకుడు సునీల్‌కు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి పర్యవేక్షణలో ఆయన 'స్ట్రెంథనింగ్ ది రిలయబిలిటి అండ్ కంజేషన్ కంట్రోల్ ఆఫ్ ఫ్లయింగ్ అడహక్ నెట్‌వర్క్స్ బై ఇంప్లిమెంటింగ్ మల్టీపాథ్ రౌటింగ్ ప్రొటోకాల్స్‌టు డిజైన్ ఎన్ ఇమ్యకులేట్ అండ్ డిక్సేరస్ ట్రోపాలజి ఫర్ సెక్యూర్ డేటా ట్రాన్స్‌మిషన్' అన్న అంశంపై పరిశోధన చేశారు. దీనికి గాను సునీల్‌కు డాక్టరేట్ లభించింది.

మాతాశిశుమరణాలు నియంత్రించాలి

బద్వేలు అర్బన్ : మాతాశిశుమరణాలు సంభవించకుండా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ సురక్షిత కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు ప్రసవం అయ్యేంత వరకు పర్యవేక్షిస్తుండాలని కోరారు. అలాగే పౌష్టికాహారం వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించాలని కోరారు. రక్తహీనత, రక్తపోటు వంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. అలాగే మలేరియా, డెంగీ, విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారంలో ఒకరోజు తప్పనిసరిగా డ్రైడే పాటించేలా చూడాలని కోరారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ విశ్వంత, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

దువ్వూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి డాక్టర్ యశస్విని తెలిపారు. దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది గర్భిణులకు డాక్టర్ డాక్టర్ యశస్విని, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.వికసిత, డాక్టర్ ఎస్.రోషిణి వైద్య పరీక్షలు నిర్వహించారు. 26 మందికి స్కానింగ్ పరీక్షలు చేశారని, 17 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. డాక్టర్లు మాట్లాడుతూ రక్తహీనత ఉన్న గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాలైన చిక్కీలు, ప్రొటీన్స్, కోడిగుడ్లు, పాలు, క్యాల్షియం కలిగిన రాగిపిండి, రాగి జావా తదితర పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ విజయకుమారి, ఎంపీహెచ్ఓ రాజగోపాల్, శాంత కుమారి, సువర్ణ, వీరాంజనేయులు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరద 'అవినీతి' గేట్లు

- ప్రతిదానికి కొండారెడ్డికి కప్పం కట్టాల్సిందే..
- నిమ్మకాయల సుధాకర్ రెడ్డి కొన్న భూమిపై పిటీషన్ పెట్టి రూ.15 కోట్లు డిమాండ్ చేశారు
- ఉద్యోగులతో ప్రమాణం చేయించిన ఎమ్మెల్యే చేస్తున్నది అవినీతి కాదా?
- ఈ సంఘటనపై మళ్లీ విచారణ ఉంటుంది
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించిన భూములపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రభుత్వానికి పిటీషన్లు పెట్టడం, తద్వారా ఆయన కుమారుడు రూ.కోట్లు గడించడం పరిపాటిగా మారిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. దొరసానిపల్లెలోని ఆయన స్వగృహంలో రాచమల్లు గురువారం విలేకరులతో మాట్లాడారు. నీతి పరుడినని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే వరద తన శేష జీవితానికి ఇదే చివరి అవకాశంగా భావించి తన కుమారుడైన కొండారెడ్డికి రూ.కోట్లు ఆర్జించి పెట్టేందుకు సిద్ధమయ్యారని రాచమల్లు ఆరోపించారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలకు ఎదురుగా సర్వే నంబర్లు 1075 నుంచి 1079 వరకు మొత్తం 29 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులోని 17 ఎకరాల భూమిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కొనుగోలు చేశారన్నారు. ఆయన మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.5కోట్లు వెచ్చించి కొనుగోలు చేశారన్నారు. మిగతా భూమిని 1985లో ప్లాట్లు వేసినప్పుడు వస్త్ర వ్యాపారులు కొనుగోలు చేశారన్నారు. నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి ఈ స్థలం కొనుగోలు, వెంచర్ తయారీకి కలిపి సుమారు రూ.150 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. తాళ్లమాపురం గ్రామ పంచాయతీకి సంబంధించిన ఈ భూములను నారాయణరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, డాక్టర్ బసిరెడ్డి రమణారెడ్డి, లీలావతి, సునీతల నుంచి కొనుగోలు చేశారన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ఎమ్మెల్యేగా గెలుస్తూనే ఈ స్థలంపై కన్నేశారు..

వరద ఎమ్మెల్యేగా గెలుస్తూనే విలువైన ఈ స్థలంపై కన్ను వేశారని రాచమల్లు తెలిపారు. ఈ భూమి చెరువు భూమి అని ఆర్డీఓకు ఫిర్యాదు చేసి అక్రమ సంపాదనకు తెరతీశారన్నారు. 1923లో బ్రిటిష్ ప్రభుత్వం నాటి కలెక్టర్ ఇది చెరువు భూమి కాదని రాసిన రికార్డులు ఉన్నాయన్నారు. నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి ఎన్ని మార్లు అధికారులను కలిసినా, ఆధారాలు చూపించినా వినకుండా ఆయనను మానసిక వేదనకు గురి చేశారని, ఈ కారణంగానే ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారన్నారు. అయినా తండ్రి, కొడుకులు తమకు పార్టీతో సంబంధం లేదని, ఆదాయమే లక్ష్యంగా డబ్బు డిమాండ్ చేశారన్నారు. తమకు కప్పం కడితేనే అనుమతి ఇచ్చేలా ముందడుగు వేశారన్నారు. సమస్య పరిష్కారం కోసం నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడైన రిటైర్డు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే అల్లుడు రామచంద్రారెడ్డిని కలిశారన్నారు. రిటైర్డు తహసీల్దార్ మధ్యవర్తిత్వంతోనే సమస్య పరిష్కారానికి గ్రీన్ సిగ్నల్ పడిందని తెలిపారు. నిన్నటి వరకు ఈ స్థలంపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే తనకు కప్పం కట్టిన వెంటనే మారుతుందా అని ప్రశ్నించారు. తహసీల్దార్ గంగయ్య సైతం ఇది పట్టా ల్యాండ్ అని సర్టిపై చేశారన్నారు.

సమస్య పరిష్కారానికి రూ.15కోట్లు డిమాండ్

ఈ సమస్య పరిష్కారానికి నంద్యాల కొండారెడ్డి రూ.15కోట్లు డిమాండ్ చేశారని రాచమల్లు ఆరోపించారు. గత నాలుగు నెలలుగా ఎంతో వేదనకు గురైన నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి చివరికి సెటిల్‌మెంట్ చేసుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. రూ.6కోట్ల నుంచి రూ.10కోట్ల మధ్యలో సెటిల్‌మెంట్ జరిగే అవకాశ ఉందన్నారు. సమాజం అంటే భయం లేకుండా అక్రమ సంపాదనకు ఎమ్మెల్యే, ఆయన కుమారుడు కొండారెడ్డి గేట్లు ఎత్తారన్నారు. ఇప్పటి వరకు ఈ భూమి సక్రమమైనది కాదని చెప్పిన ఆర్డీఓ రేపో మాపో కరెక్ట్‌గా ఉన్నట్లు చెబుతారన్నారు. ముందు ఎందుకు ఈ భూమి సరైనది కాదో అన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై మళ్లీ విచారణ చేయిస్తామని అన్నారు.

వరద ప్రమాణం చేయాలి

నిమ్మకాయల సుధాకర్ రెడ్డి వెంచర్‌కు సంబంధించిన భూమిలో అవినీతికి పాల్పడలేదని ఎమ్మెల్యే వరద , ఆయన కుమారుడు కొండారెడ్డి వారు కొలిచే రాధాస్వామి సాక్షిగా ప్రమాణం చేయాలని, వారు ఇందులో అవినీతికి తెరలేపినట్లు తాను శివపార్వతుల సాక్షిగా ప్రమాణం చేస్తానని రాచమల్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, లావణ్య, గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, కోపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION
■B.Com, B.Com (Comp.Sci)BBA, B.Sc, M.Sc, MBA, B.Tech (LE) Failed / Discontinue Students. Contact Cell: 82474 57565. [T-3338]

SERIVCES

BUSINESS OFFER
■కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్టుల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906. [T-288]

CHANGE OF NAME
■ I, SAGINALA RAMEJA (OLD NAME), H.NO. 1/119, BRAHMANAPALLI (V), (P), RAJAMPET (M), ANNAMAYYA (DT), A.P, HEREBY CHANGED MY NAME AS SAGINALA RAMIJA BEE (NEW NAME), W/O. SAGINALA PEDDA PITCHAIAH.

PASS PORT MISSING
■ పాస్‌పోర్టు నెంబరు : B6728740 ISSUE DATE : 22-11-2023, EXPIRE DATE : 21-11-2033. ISSUED BY THE Regional Passport Officer-DOHA. SYED NASEER BASHA S/O. SYED KHADER BASHA R/O D.NO: 27/73, Konda Reddy Street, Bethal Colony, Rayachoty, Annamayya (Dist), A.P. అను నేను, దిరహామ : కలిగిన పాస్‌పోర్టును తేదీ 30-12-2024 వ తేదీన కడప పోస్టలు రాయచోటి బస్టాండు నుండి వెళ్తున్న సమయంలో ఎక్కడో జారి పోయినది. దొరికిన వారు దయచేసి పై చిరునామాకు తెలుపగలరు.

WANTED
■ కడప నగరంలోని UTI ITSL IT PAN CARD నందు అటెండర్ గా పనిచేయుటకు 10 వ తరగతి చదివిన 25 సం॥ వయస్సు కలిగిన యువతి కావలెను. సంప్ర : డి.నెం: 21/-10, తిరుమల ఆసుపత్రి దగ్గర అర్.యస్.రోడ్ LED ప్రక్కన, కడప
■శ్రీ హనుమాన్ ఆటో ఫైనాన్స్ నందు పనిచేయుటకు రాయచోటి టౌన్ యందు అకౌంటెంట్ కావలెను. క్వాలిఫికేషన్ : ఏదీ డిగ్రీ, సంప్రదించవలసిన నెంబర్స్ : 9154851213, 9676190343

■Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418.
■నంద కిర్లస్ ఆటో ఫైనాన్స్ నందు పనిచేయుటకు రికవరీ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: ఇంటర్ లేదా డిగ్రీ, ఫైనాన్సు యందు కనీసము ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి, త్రీ వీలర్ అండ్ ఫోర్ వీలర్ డ్రైవింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వయస్సు: 22 సం. నుండి 30 సంవత్సరాల లోపు ఉండవలెను. సంప్రదించండి సెల్: 9959594942, 8309228524.
■ కస్టమర్లకు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 6309020999

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి స్పందించవలసిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించాలి.

ఉపాధి నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకే ఓపెన్‌ఫోరమ్

బి.కోడూరు : ప్రతి ఏడాది మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకే ఈ సామాజిక తనిఖీ సమావేశం దోహదపడుతుందని డ్వామా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ తెలిపారు. గురువారం బి.కోడూరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 19వ సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు రూ.8.50 కోట్ల నిధులకు సంబంధించి సిబ్బందిచే విచారణ జరిపించి బహిరంగంగా ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఇందులో రూ.36 వేలు అవకతకవలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో అందుకు కారకులైన వారి నుంచి రికవరీ చేశారు. అలాగే తుమ్మలపల్లె ఫీల్డ్‌అసిస్టెంట్‌పై విచారణకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి రామలింగారెడ్డి, ఎస్‌ఆర్‌సీ భాస్కర్, ఏపీడీ ఆనంద్, ఏపీఓ రాజాసాహెబ్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంపీపీ చెన్నమ్మ, ఈసీ ఖాజా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిసెంట్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ జంప్ రోప్ పోటీల్లో మైదుకూరు విద్యార్థికి పతకాలు

మైదుకూరు : నేపాల్‌లో జరిగిన అండర్ 17 అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో మైదుకూరు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన హరీష్ అనే విద్యార్థి బంగారు, వెండి పతకాలను సాధించాడు. నేపాల్‌లో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు ఇండో - నేపాల్ జంప్ రోప్ ఇంటర్నేషనల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఇండియా నుంచి 30 మంది సభ్యులు గల టీం జంప్ రోప్ పోటీల్లో పాల్గొన్నట్లు మైదుకూరు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రావతి, వినోనియా రాణి తెలిపారు. గత ఏడాది ఏప్రిల్‌లో మధ్యప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీలు జరగగా అక్కడ ప్రతిభ చూపి హరీష్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. దీనిపై పాఠశాల హెడ్మాస్టర్ రామమోహన్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నిర్ణీత గడువులోగా రైల్వే అభివృద్ధి పనులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అమృత్ భారత్ పథకంలో భాగంగా కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను నాణ్యత పరంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ఆదేశించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌ఎం కడప, రాజంపేట రైల్వేస్టేషన్లలో జరుగుతున్న పనుల పరిశీలన నిమిత్తం గురువారం వచ్చారు. తొలుత ఆయన కడప నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. అందులో భాగంగా పనులు ఏ మేరకు పూర్తయ్యాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎస్కలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏ ప్రాంతంలో వస్తుందో తెలుసుకున్నారు. అనంతరం మ్యాప్‌ను పరిశీలించి ఆయా పనుల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ఈ పనులను ఈ ఏడాది డిసెంబరులోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆ దిశగా అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే నాణ్యత పరంగా రాజీలేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్, సీనియర్ డీఈఎన్ అభిరామ్, కడప స్టేషన్ మేనేజర్ శేఖర్‌కుమార్, ఏడీఎన్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక శ్రీనివాసనగర్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. షేక్ మహబూబ్‌బాషా భారత్ సా మిల్ పేరుతో శ్రీనివాసనగర్‌లోని బాలాజీ గ్యాస్ ఎదురుగా టింబర్ డిపోను నిర్వహిస్తున్నాడు. ఈ నెల 1న రాత్రి డిపోలో అగ్నిప్రమాదం సంభవించి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈ సంఘటన ప్రమాదవశాత్తు జరిగింది కాదని, కొందరి వ్యక్తుల ప్రమేయంతో జరిగిన సంఘటనగా అనుమానం వ్యక్తం చేస్తూ డిపో యజమాని మహబూబ్‌బాషా టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా టింబర్ డిపో ఉన్న స్థలానికి సంబంధించి మహబూబ్‌బాషా, వారి బంధువుల మధ్య కొనేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో బంధువులు తనను అనేక విధాలుగా బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అతను ఫిర్యాదులో పేర్కొన్నాడు. డిపోలో జరిగిన అగ్నిప్రమాదంలో వీరి ప్రమేయం ఉంటుందని అతను ఫిర్యాదు తెలిపాడు.

పొలాల పరిశీలన

చాపాడు : చాపాడు, పల్లవోలు గ్రామాల వద్ద ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న పొలాలను గురువారం జమ్మలమడుగు ఆర్డీఓ సాయి శ్రీ పరిశీలించారు. మండల కేంద్రమైన తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ప్రొద్దుటూరుకు చెందిన నరసింహారెడ్డి అనే వ్యక్తికి చెందిన 1.30 ఎకరాలు, పల్లవోలు సమీపంలో ఓబుళరెడ్డి అనే వ్యక్తికి చెందిన 7 ఎకరాల పొలాలను ఆర్డీఓ పరిశీలించారు. భూ మార్పిడికి సంబంధించిన రికార్డులను ఆర్డీఓ పరిశీలించారు. దీనిపై తదుపరి ఉత్తర్వులను ఆర్డీఓ జారీ చేయాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమాకుమారి, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిల్వ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధిలోని హోటళ్ళలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయిస్తే జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పలు హోటళ్ళను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు గుర్తించి మొదటి హెచ్చరికగా వారిని మందలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హోటల్ పరిసరాలు పరిశుభ్ర వాతావరణంలో ఉండటంతో పాటు శుభ్రమైన ఆహార పదార్థాలను మాత్రమే ప్రజలకు విక్రయించాలని కోరారు. అలాగే ఆహార పదార్థాల తయారీలో నిషేధిత రసాయనాలను వాడరాదని సూచించారు. ఏవైనా హోటళ్ళలో చెడిపోయిన, కుళ్ళిన ఆహార పదార్థాలు ఉన్నట్లు తమ తనిఖీల్లో గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శానిటేషన్ సెక్రటరీలు తరచూ హోటళ్ళను తనిఖీ చేస్తూ ఉండాలని సూచించారు.

ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలి

ప్రొద్దుటూరు : ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి కాంట్రాక్టు పద్ధతిలో ఆప్కాస్ ఉద్యోగులను తీసుకోవాలని పశువైద్య కళాశాల వద్ద గురువారం కళాశాలలో పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆప్కాస్ ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 2ను ఆప్కాస్ (ఔట్‌సోర్సింగ్) ఉద్యోగులకు వర్తింపజేసేలా సవరణలు చేయాలని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి కాంట్రాక్ట్‌లోకి తీసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకాష్ సతీష్, ఆర్‌వీ సుబ్బారావు, హుస్సేన్, దస్తగిరి, సుబ్బయ్య, శ్రీనివాసులు, పీటీ రవి, గోపాలకృష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

వికసిత భారత్ లక్ష్య సాధనకు యువతే కీలకం

ప్రొద్దుటూరు : వికసిత భారత్ లక్ష్య సాధనకు యువతే కీలకమని, యువతకు స్వామి వివేకానంద సూక్తులు జీవిత పాఠాలు ఎంతగానో దోహదపడతాయని కడప రామకృష్ణ మిషన్ అసిస్టెంట్ సెక్రటరీ స్వామి సన్నివాసానంద తెలిపారు. గురువారం స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో 'స్వామి వివేకానంద యువతకు సందేశం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేవండి, మేల్కోండి, గమ్యం చేరే వరకూ విశ్రమించకండి, మిమ్మల్ని మీరు మేల్కొల్పుకొని ఇతరులను మేల్కొల్పండని తెలిపారు. యువతలో చైతన్యం నింపడానికి, వారిని దేశాభివృద్ధిలో భాగం చేయడానికి స్వామి వివేకానంద జీవన విధానాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. రోజుకు ఒక సారి మీతో మీరు మాట్లాడుకోండి, లేకపోతే మీరు ఈ ప్రపంచంలో ఒక తెలివైన వ్యక్తిని కలిసే అవకాశం కోల్పోతారన్నారు. మీ భయాలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు, హెచ్‌ఓడీ, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఎంవీవీ ప్రసాద్, అడ్మినిస్ట్రేటర్ ఎం.రజనీకాంత్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయలసీమ బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్

రాజుపాళెం : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలో 18, 19వ తేదీల్లో గ్రేటర్ రాయలసీమ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కిరణ్‌కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్ధ బహుమతులుగా రూ.15,016, రూ.12,016, రూ.10,016, రూ.8,016 నగదు బహుమతులు, మెమెంటోలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల వారంతా ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9000659990, 9581899813 శివరామకృష్ణారెడ్డిని సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయం, బొల్లవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం తదితర వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. స్థానిక శ్రీమహాలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున 2.30 గంటల నుంచి భక్తులు ఉత్తర ద్వారం గుండా మహా విష్ణువును దర్శించేందుకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు బారీకేడ్లను ఏర్పాట్లు చేశారు. బొల్లవరం ప్రసన్నవేంకటేశ్వరస్వామి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేశారు.

- స్థానిక శ్రీకృష్ణాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా స్వామివారి దర్శనం ఉంటుందని శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కార్యదర్శి గండి ఆంజనేయులు కోరారు.
- స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజాము 4.30 నుంచి ఉత్తర ద్వారం ద్వారా స్వామివారి దర్శనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా అమెరికా, న్యూజిలాండ్, ఆఫ్రికా తదితర ప్రాంతాల్లో భగవద్గీతను ప్రచారం చేస్తున్న శ్రీ వేదవ్యాస ప్రియ స్వామి మహారాజ్ పాల్గొననున్నారు. భక్తులకు స్వామివారి క్యాలెండరు, వెన్నలడ్డూ అందించనున్నారు.

టీటీడీ అధికారుల నిర్లక్ష్యంతోనే దుర్ఘటన

ప్రొద్దుటూరు : తిరుపతిలో జరిగిన దుర్ఘటన టీటీడీ అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జీవీ సుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీటీడీ అధికారులు ఒక ప్రణాళిక లేకుండా వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు జారీ చేసే విషయంలో గేట్లు ఎత్తడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో అమాయకులైన ఆరు మంది భక్తులు చనిపోవడం బాధాకరమని తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే వైకుంఠ ఏకాదశికి ప్రభుత్వం అంచనాలు లేకుండా నిర్దిష్ట ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ సంఘటన జరిగిందని పేర్కొన్నారు. ఈ సంఘటనకు డీఎస్పీని మాత్రమే బాధ్యునిగా చేయడం హేయమైన చర్య అని, దీనికి టీటీడీ బోర్డు చైర్మన్ నాయుడు, పాలక వర్గం బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

తిరుమలలో విషాదం అత్యంత బాధాకరం


మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట (చాపాడు): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టోకన్ల జారీ కౌంటర్ల వద్ద జరిగిన తీవ్ర తొక్కిసలాటలో ఆరు మంది భక్తులు మృతి చెందడం అత్యంత భాధాకరమని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. చనిపోయిన భక్తులు ఒక్కొక్కరికి కోటి రూపాయలు, క్షతగాత్రులకు రూ. 20లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. గురువారం దుంపలగట్టులో రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనపై టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు బాధ్యత వహించి రాజీమానా చేయాలన్నారు.

మహనీయుల ఆశయసాధనకు కృషి చేద్దాం

బద్వేలు అర్బన్ : మహనీయుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని విశ్రాంత జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మార్కారెడ్డి, వైవీయూ పాలకమండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావులు పేర్కొన్నారు. సావిత్రిబాయిఫూలే, షేక్‌ఫాతిమా జయంతి మాసోత్సవాల్లో భాగంగా గురువారం మహనీయుల ఆశయసాధన సమితి, పట్టణాభివృద్ధి సొసైటీ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో సిద్దవటంరోడ్డులోని సావిత్రిబాయిఫూలే విగ్రహానికి, షేక్‌ఫాతిమా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణాభివృద్ధి సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం ఎంఈఓ ప్రమీల, లైబ్రేరియన్ లక్ష్మిదేవిలతో పాటు మరికొంత మంది మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.




మైదుకూరులోని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

మెరుగైన వైద్యం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు ఉన్నత చదువులు చదివే ఆకాశం ఏర్పడింది. శ్రీవెంకటేశ్వర బాలికల జూనియర్ కళాశాల పేరుతో ప్రత్యేకంగా బాలికల కోసం ఓ కళాశాల నడుస్తోంది. అదేవిధంగా శ్రీవెంకటేశ్వర దూర విద్య కేంద్రం పేరుతో ప్రైవేట్‌గా టెన్త్, ఇంటర్ చదివే విద్యార్థులకు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు, కడప ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం మైదుకూరులో పదుల సంఖ్యలో ఆస్పత్రుల ఏర్పాటు జరిగింది. జనరల్ వైద్యంతో పాటు డెంటల్, కంటి ఆస్పత్రులు వెలిశాయి. స్థానిక వనిపెంట రోడ్డులో హెచ్‌సీసీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుతో మైదుకూరులో పలు వైద్య విభాగాలలో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. బద్వేలు రోడ్డులో ఎస్ఎల్ఆర్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వైద్యం అందుబాటులో ఉంది. పట్టణ నడిబొడ్డులో ఉన్న శ్రీలక్ష్మీ మాధవరాయ భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యం పూజా కార్యక్రమాలు జరుగుతూ పండుగ వేళల్లో భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నాయి. పట్టణంలో కాలనీలు కూడా విరివిగా వెలుస్తున్నాయి. అదేవిధంగా అన్ని సౌకర్యాలతో గేటెడ్ కమ్యూనిటీ పేరుతో ఇళ్ల నిర్మాణాల కోసం వెంచర్లు కూడా వేస్తున్నారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మైదుకూరు పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుండటంతో ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన సిమెంట్, స్టీల్ అంగళ్లతో పాటు పీఓపీ డిజైన్స్, స్టీల్ రైలింగ్స్ దుకాణాలు నిర్వహిస్తున్నారు.





మైదుకూరులో సౌకర్యాల అభివృద్ధి


శ్రీలక్ష్మీ మాధవ రాయస్వామి ఆలయం

మైదుకూరు : రాయలసీమలోనే కూడలి కేంద్రంగా ఉన్న మైదుకూరులో ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. కడప, ప్రొద్దుటూరు నగరాలు మైదుకూరుకు దగ్గరగా ఉండటంతో గతంలో పట్టణ వాసులు కొనుగోళ్లకు అక్కడికి వెళుతుండేవారు. 12 ఏళ్ల కిందట మైదుకూరు మున్సిపాలిటీగా రూపాంతరం చెందినప్పటి నుంచి సౌకర్యాల కల్పన పెరుగుతోంది. బట్టల షాపులు, ఫ్యాన్సీ స్టోర్లు ఒకే కాంప్లెక్స్‌లో ఉండే సౌకర్యం పట్టణంలో ఇప్పటికే నెలకొంది.












మైదుకూరులో వెలసిన సీవీఎన్ మౌళిక సిల్క్స్ షాపింగ్ మాల్

మైదుకూరులో ప్రత్యేకించి షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లు ఏర్పడ్డాయి. నిత్యావసర వస్తువుల కోసం హోల్‌సేల్ దుకాణాలు కూడా ఉండటం విశేషం. కేపీ ఉల్లి వంటి ఎగుమతి రకం పంటకు మైదుకూరు కేంద్రంగా ఉంది. అదే విధంగా పసుపు, బొప్పాయి, అరటి వంటి వాణిజ్య పంటలు కూడా విరివిగా సాగులో ఉన్నాయి. ఇందు కోసం రైతులకు మొక్కలను అందించేందుకు పెద్ద సంఖ్యలో నర్సరీలు కూడా వెలిశాయి. కొద్ది రోజుల కిందట స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీవీఎన్ మౌళిక సిల్క్స్ పేరుతో ప్రత్యేకంగా మహిళల కోసం ఓ షాపింగ్ మాల్ వెలసింది. ఇక్కడ ప్రత్యేకంగా మహిళలకు చీరలు, చుడీదార్లు, అమ్మాయిలకు డ్రెస్ మెటీరియల్స్, కిడ్స్ వేర్ వంటివి విక్రయిస్తున్నారు. పట్టణంలో రెడీమేడ్ దుస్తుల షాపులు కూడా విరివిగా ఉన్నాయి. ఇక వివిధ హెయిర్ స్టైల్స్ చేసే సెలూన్లను యువత కోసం ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతున్నాయి.















